నమస్తే తెలంగాణ

# వికారాబాద్

I | హైదరాబాద్, మంగళవారం 5 నవంబర్ 2024 | VIKARABAD




సీఐటీయూ ఆధ్వర్యంలో వికారాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

## వేతనాలు చెల్లించండి

# మహాప్రభో..

**జీతాలు రాకుంటే ఎలా బతకాలి**

**ఐదు నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలి**

**వికారాబాద్, రంగారెడ్డి కలెక్టరేట్ల ఎదుట అంగన్‌వాడీల ధర్నా**

వికారాబాద్/ఆదిబట్ల, నవంబర్ 4 : ఐదు నెలల వేతనాలు రాక ఇబ్బందిపడుతున్న అంగన్ వాడీ టీచర్లపై సర్వే పేరుతో మరింత అదనపు భారం వేయడం సరి కాదని తెలంగాణ అంగన్ వాడీ టీచర్స్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ వికారాబాద్ జిల్లా కార్యదర్శి భారతి, సీఐటీయూ వికారాబాద్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మహిపాల్, రామకృష్ణ మండిపడ్డారు. అంగన్‌వాడీ టీచర్లకు వెంటనే ఐదు నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం వికారాబాద్, రంగారెడ్డి కలెక్టరేట్ల ఎదుట వికారాబాద్ జిల్లా అధ్యక్షురాలు నరసమ్మ, రంగారెడ్డి జిల్లా అంగన్‌వాడీల కార్యదర్శి కవిత ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిం చా రు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని మినీ అంగన్ వాడీ సెంటర్లలో పని చేస్తున్న టీచర్లకు పూర్తి వేతనం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని, సెంటర్లలో హెల్పర్స్‌ను నియమించడంతోపాటు ఖాళీ పోస్టులను భర్తీ చేయాలన్నారు. అనేక పోరాటాల ఫలితంగా మినీ అంగన్‌వాడీ టీచర్లను మెయిన్ అంగన్ వాడీలుగా గుర్తించి.. రూ.13,650 చొప్పున మూడు నెలలు మాత్రమే చెల్లించారని.. ఆ తర్వాత మళ్లీ మినీ అంగన్‌వాడీలకు ఇచ్చే వేతనమే ఇచ్చారన్నారు. గత ఐదు నెలలుగా వేతనాలు రాకుంటే ఎలా బతుకుతామని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. వెంటనే ఆ పెండింగ్ వేతనాలను చెల్లించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.రెండు లక్షలు ఇవ్వాలని, ప్రమాద బీమా సౌకర్యం రూ.30 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం సీఐటీయూ యూనియన్ ఆధ్వర్యంలో వికారాబాద్ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌కు, రంగారెడ్డి అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌కు వినతి పత్రాలను అందజేశారు. ధర్నాలో అంగన్‌వాడీ యూ నియన్ ప్రాజెక్టుల అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మి, కవిత, సంగీత, విజయలక్ష్మి, భారతి, నిర్మల, మంజుల, సరూప, శ్వేత, కమలాదేవి, శాంతి, సునీత, అనసూయ, అంగన్‌వాడీ టీచర్లు రాధ, వాణి, నవనీత, రేణుక, కల్పన తదితరులు పాల్గొన్నారు.



రంగారెడ్డి అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న అంగన్‌వాడీలు

### మాజీ సర్పంచుల అరెస్టు దారుణం



పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరుతూ శాంతియుత నిరసనకు వెళ్తున్న తాజా మాజీ సర్పంచులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడం సరికాదు. శాంతియుత నిరసనను రాష్ట్ర ప్రభ్వుం పోలీసులతో అణగదొక్కడం దుర్మార్గమైన చర్య. వికారాబాద్ జిల్లాతోపాటు రాష్ట్రవ్యాప్తంగా అక్రమంగా అరెస్టు చేసిన తాజా మాజీ సర్పంచ్‌లను వెంటనే విడుదల చేయాలి. పెండింగ్ బిల్లులను జాప్యం చేయొద్దు.

– మెతుకు ఆనంద్, వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు



నందిగామ పోలీస్ స్టేషన్‌లో సర్పంచ్‌ల సంఘం రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు

# నిర్బంధకాండ

## పెండింగ్ బిల్లులు అడిగితే అరెస్టు చేయిస్తారా..

*పెండింగ్ బిల్లుల కోసం పోరుబాట పట్టిన తాజా మాజీ సర్పంచులపై ప్రభుత్వం కక్షగట్టింది. 'చలో హైదరాబాద్' శాంతియుత నిరసనకు సిద్ధమైన వారిని ఎక్కడి కక్కడ పోలీసులతో అరెస్టు చేయించింది. సోమవారం తెల్లవారుజాము నుంచే ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో పోలీసుల నిర్బంధకాండ కొనసాగింది. ప్రధానంగా బీఆర్‌ఎస్‌కు చెందిన చాలామంది మాజీ సర్పంచులను పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేసి అదుపులోకి తీసుకుని ఠాణాలకు తరలించారు. రౌడీమూకలు, సంఘ విద్రోహులను ఎత్తుకెళ్లినట్లు తమ వారిని అదుపులోకి తీసుకోవడంపై మాజీ సర్పంచ్‌ల కుటుంబ సభ్యులు మండిపడ్డారు. నిధుల్లేక ప్రత్యేక అధికారుల పాలనలో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడుతున్నదని.. గతేడాదిగా పెండింగ్ బిల్లులు చెల్లించకపోవడంతో అప్పుల్లో కూరుకుపోయామని తాజా, మాజీ సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. ఇదేనా ప్రజాపాలన.. ఇదేనా ఇందిరమ్మ రాజ్యమంటే? అని ప్రశ్నించారు.*

*- న్యూస్ నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ*


4లో..


**ప్రజాపాలన అంటే ఇదేనా..**

**ప్రభుత్వం తీరుపై తాజా మాజీ సర్పంచ్‌ల మండిపాటు**

**వెంటనే పెండింగ్ బిల్లులను చెల్లించాలని డిమాండ్**

### ప్రభుత్వం భేషజాలకు పోవద్దు.. నిధులు విడుదల చేయాలి




పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలని శాంతియుత నిరసనకు సిద్ధమైన తాజా మాజీ సర్పంచ్‌లను ప్రభుత్వం పోలీసులతో అక్రమంగా అరెస్టు చేయించడం దారుణం. వారు అప్పులు చేసి గ్రామాల్లో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. ఆ నిధులను కూడా విడుదల చేయకపోవడం తగదు. రేవంత్ సర్కార్ భేషజాలకు పోకుండా వెంటనే పెండింగ్ బిల్లులను చెల్లించి వారిని ఆదుకోవాలి. అంతేకాకుండా పోలీసులు అక్రమంగా అరెస్టు చేసిన తాజా మాజీ సర్పంచ్‌లను విడుదల చేయాలి.

–అంజయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యే, షాద్‌నగర్



మాజీ సర్పంచ్,ఉపసర్పంచులను అరెస్ట్ చేసిన పెద్దేముల్ పోలీసులు





**ప్రశ్నార్థకంగా పంచాయతీల మనుగడ**

**అర్బన్ అథారిటీతో ప్రజలకు మరిన్ని కష్టాలు**

**తగ్గనున్న జీపీల ఆదాయం.. ప్రజలపై పెరుగనున్న పన్నుభారం..**

**పంచాయతీలకు వచ్చే రెవెన్యూలో సగానికిపైగా అర్బన్ అథారిటీకే..**

**భవిష్యత్తులో భవన నిర్మాణ, ఇతర అనుమతుల్లోనూ అర్బన్ అథారిటీదే పెత్తనం**

**జిల్లాలోని 4 మున్సిపాలిటీలు, 493 రెవెన్యూ గ్రామాలతో.. వికారాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు**

# పంచాయతీలు నిర్వీర్యం!

*జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలు, 493 రెవెన్యూ గ్రామాలను కలుపుతూ ప్ర భుత్వం వికారాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(వుడా)ని ఏర్పాటు చేసింది. వుడా ఏర్పాటుతో గ్రామ పంచాయతీలు నిర్వీర్యం అవుతాయని, వాటి మనుగడ ప్రశ్నార్థకంగా మారనున్నదని, ప్రజలకు మరిన్ని కష్టాలు పెరుగుతాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. పంచాయతీలకు ప్రజల నుంచి పన్నుల రూపంలో వచ్చే ఆదాయంలో సగానికిపైగా అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీకే వెళ్లనున్నదని.. భవిష్యత్తులో భవన నిర్మాణ, ఇతర అనుమతులను అర్బన్ అథారిటీ నుంచి పొందాల్సి వస్తుందని, అంతేకాకుండా కేంద్రం నుంచి గ్రామాలకు వచ్చే నిధులూ ఆగిపోనున్నాయని పలువురు పేర్కొంటున్నారు.*

*- వికారాబాద్, నవంబర్ 4 (నమస్తే తెలంగాణ)*

కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో గ్రామ పంచాయతీల మనుగడ ప్రశ్నార్థకం కానున్నది. జిల్లాను యూనిట్‌గా తీసుకొని ఏర్పాటు చేసిన వికారాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (వుడా)తో జిల్లావాసులకు మరిన్ని కష్టాలు రానున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. జిల్లా సమగ్రాభివృద్ధికే వుడాను ఏర్పాటు చేశామని ప్రభుత్వం చెబుతున్నా.. అర్బన్ అథారిటీ ద్వారా ప్రజల నుంచి పన్నుల రూపంలో మరింత ఆదాయాన్ని రాబట్టేలా ప్రణాళిక ఉన్నదనే చర్చ జరుగుతున్నది. అంతేకాదు అర్బన్ అథారిటీ అందుబాటులోకొస్తే గ్రామ పంచాయతీలు పూర్తిగా నిర్వీర్యం కానున్నాయి. ప్రస్తుతం గ్రామ పంచాయతీలకు నేరుగా వచ్చే ఆదాయంలో సగానికిపైగా అర్బన్ అథారిటీ డెవలప్‌మెంట్‌కు వెళ్లనున్నది. ప్రస్తుతం కొన్ని గ్రామ పంచాయతీల్లో లే-అవుట్లు తదితరాలతో గ్రామాల అభివృద్ధికి సరిపడా రెవెన్యూ సమకూరుతున్నది. అంతేకాకుండా అర్బన్ అథారిటీ పరిధిలోని పంచాయతీలు, మున్సిపాలిటీల్లో పన్నులు కూడా భారీగా పెరిగి ప్రజలకు మరింత భారం కానున్నది. దీంతో పంచాయతీలకు ఇకపై పన్ను వసూలు విషయంలోనే అజమాయిషీ ఉంటుందని, వసూలైన పన్ను ల్లో మెజార్టీ శాతం ఆదాయం అథారిటీకే వెళ్లనుందనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. చిన్న గ్రామ పంచాయతీలతోనే సుపరిపాలన, సమగ్రాభివృద్ధి సాధ్యమని భావించిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం.. కొత్త గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేసి అభివృద్ధితోపాటు స్వచ్ఛత తదితరాలకు భారీగా నిధులు వెచ్చించి దేశంలోనే ఆదర్శ గ్రామ పంచాయతీలుగా అవార్డులు సాధిస్తే... కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం గ్రామ పంచాయతీలను నిర్వీర్యం చేసి ఆర్థికంగా చితికిపోయేలా వ్యవహరిస్తున్నదని పలువురు మండిపడుతున్నారు.

### ఇక.. అథారిటీదే పెత్తనం

అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటుతో గ్రామ పంచాయతీలు నిర్వీర్యం కానున్నాయి. పంచాయతీల అభివృద్ధే ధ్యేయంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం జిల్లాలో ఉన్న 365 గ్రామ పంచాయతీలను 560కి పెంచింది. వాటిలో దాదాపు 100 తండాలను పంచాయతీలుగా ఏర్పాటు చేసి గిరిజనులకు స్వపరిపాలనతోపాటు అధికారా న్ని కల్పించింది. కాంగ్రెస్ ప్రభుత్వ తీరుతో గిరిజనులకు స్వపరిపాలన దూరమై సర్వాధికారాలు అర్బన్ అథారిటీ పరం కానున్నాయి. అంతేకాకుండా భవన నిర్మాణ అనుమతులు మొదలుకొని వాణిజ్య తదితర అనుమతులన్నీ అర్బన్ అథారిటీ నుంచి పొందాల్సిందే. ఇప్పటివరకు గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో ఉన్న ఫీజులకు మించి అర్బన్ అథారిటీలో ఉండనున్నాయి. పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు కూడా ఆగిపోనున్నాయి. అధికారంలోకి వచ్చి 11 నెలలు దాటినా గ్రామ పంచాయతీలకు రూపాయీ విదల్చని కాంగ్రెస్ ప్రభుత్వం .. అర్బన్ అథారిటీతో ఏమి ఒరగబెడుతుందని పలువురు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు.

### వుడా ఏర్పాటు..

జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలు, 493 రెవెన్యూ గ్రామాలను కలుపుతూ ప్ర భుత్వం వికారాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ( వుడా) ఏర్పాటు చేసింది. జిల్లాలోని వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ మున్సిపాలిటీలతోపాటు కొడంగల్ మండలంలోని 17 రెవెన్యూ గ్రామాలు, వికారాబాద్ మండలంలోని 24 రెవెన్యూ గ్రామాలు, తాండూరు మండలంలోని 39 రెవెన్యూ గ్రామాలు, పరిగి మండలంలోని 35, బొంరాస్‌పేట మండలంలోని 16, దుద్యాల మండలంలోని 12, కులకచర్ల మండలంలోని 15, బషీరాబాద్ మండలంలోని 30, మోమిన్‌పేట మండలంలోని 22, నవాబుపేట మండలంలోని 21, ధారూరు మండలంలోని 32, దౌల్తాబాద్ మండలంలోని 24, యాలాల మండలంలోని 32, బంట్వారం మండలంలోని 13, కోట్‌పల్లి మండలంలోని 17, పూడూరు మండలంలోని 33 , మర్పల్లి మండలంలోని 27, దోమ మండలంలోని 27, పెద్దేముల్ మండలంలో ని 28, చౌడాపూర్ మండలంలోని 13 రెవెన్యూ గ్రామాలను వుడా పరిధిలోకి తీసుకుని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వుడా చైర్మన్‌గా కలెక్టర్, వైస్ చైర్మన్‌గా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, సభ్యులుగా ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి లేదా కార్యదర్శి లేదా వారు నామినేట్ చేసిన వారితోపాటు సీడీఎంఏ, డీటీసీపీ సభ్యులుగా నియమించారు.

# ఆగిపోయిన మెట్రో

**సాంకేతిక లోపంతో 15 నిమిషాలు నిలిచిన రైలు**

**ఉక్కిరిబిక్కిరైన నగర వాసులు**



సిటీబ్యూరో, నవంబర్ 4(నమస్తే తెలంగాణ) : మహానగరంలో మెట్రో రైళ్ల రాకపోకలు స్తంభించాయి. ఉదయాన్నే ఆఫీసులకు వెళ్లే హడావిడిలో ఉండే సిటీ జనాలను.. బోగీల్లో కుక్కి ఉక్కిరిబిక్కిరి చేసింది. నిమిషమో, రెండు నిమిషాలు ఆగిపోయిందంటే పొరపాటే. ఏకంగా 15 నిమిషాలు ఎటు కదలకుండా ప్రయాణికులను ఆందోళనకు గురి చేసింది. ట్రైన్ దిగి మెట్రో స్టేషన్లకు వెళ్లేందుకు కూడా అవకాశం లేకుండా నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులు ఆందోళనకు గురి కాగా, నగరంలోని ప్రధాన మెట్రో స్టేషన్లన్నీ జనాలతో కిక్కిరిసిపోయాయి. ముఖ్యంగా ఉదయాన్నే ఆఫీసులు, కాలేజీలకు వెళ్లే సమయం కావడంతో నాగోల్ – రాయదుర్గం, ఎల్బీనగర్ – మియాపూర్ మార్గంలో పలు సర్వీసుల రాకపోకలు నిలిచిపోయాయి.

హైదరాబాద్ నగరంలో సోమవారం ఉదయం మెట్రో రైళ్లు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. సాంకేతిక లోపం కారణంగా రైళ్లు ఆగినట్లు మెట్రో అధికారులు తెలిపారు. మెట్రో యాజమాన్యం తెలిపిన వివరాల ప్రకారం.. నాగోల్-రాయదుర్గం, ఎల్బీ నగర్- మియాపూర్ మార్గాల్లో పరుగులు తీసే మెట్రో రైళ్లకు అంతరాయం ఏర్పడింది. సాంకేతిక లోపాన్ని సవరించడంతో అప్పటికే తీవ్ర ఆలస్యం కావడంతో ప్రయాణికులు అసహనం వ్యక్తం చేశారు.

### మూసుకోని గేట్లు..

నాగోల్ నుంచి రాయదుర్గం వెళ్తున్న ట్రైన్... బేగంపేట్ మెట్రో స్టేషన్‌కు రాగానే నిలిచిపోయింది. ట్రైన్ డోర్లు మూసుకుపోలేదు. దీంతో ట్రైన్ ముందుకు కదలకుండా ఆగింది. ఈ కారణంగా అమీర్‌పేట్ ఇంటర్ చేంజ్‌తోపాటు ఎల్బీనగర్ – మియాపూర్ మార్గంలో వచ్చిపోయే సర్వీసులకు కూడా ఇబ్బంది కలిగింది. దీంతో అన్ని మెట్రో స్టేషన్ల వద్ద గంటల కొద్దీ ప్రయాణికులు ఎదురు చూడాల్సి వచ్చింది. ప్రధాన ఇంటర్ చేంజ్‌లైన ఎంజీబీఎస్, అమీర్‌పేట్ వద్ద ప్రయాణికులతో కిక్కిరిసిపోయింది. అయితే ఉన్నపళంగా రైళ్లు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు.

### సాంకేతిక లోపమే కారణం : మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి

దాదాపు 15నిమిషాల పాటు మెట్రో రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయని మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. రైళ్ల ఫ్రీక్వెన్సీని పునరుద్ధరించామని వివరించారు. సాంకేతిక సమస్యల వల్ల నాగోల్-రాయదుర్గం మార్గంలో బేగంపేట్ మెట్రో స్టేషన్ సమీపంలో నిలిచిపోయిందని, దాదాపు 15 నిమిషాల పాటు మెట్రో సేవలకు అంతరాయం కలిగిందన్నరు. బేగంపేట్ వద్ద ఈ సమస్య రావడంతో.. అమీర్‌పేట్, మియాపూర్, నాగోల్ రూట్‌లో మెట్రో రైళ్లను నిలిపివేయాల్సి వచ్చిందన్నారు. మెట్రో రైళ్లను రీస్టార్ట్ చేయడంతోనే సేవలు యథావిధిగా ప్రారంభమైనట్లు స్పష్టం చేశారు.

## ఉచిత పార్కింగ్ కొనసాగించాలని మెట్రో ప్రయాణికుల ధర్నా

ఉప్పల్, నవంబర్ 4 : నాగోల్‌లో మెట్రో రైల్ స్టేషన్ ఆవరణలో ఉచిత పార్కింగ్ కొనసాగించాలని కోరుతూ సోమవారం మెట్రో ప్రయాణికులు ధర్నా నిర్వహించారు. కనీస వసతులు కల్పించాలని, ఉచితంగా పార్కింగ్ సౌకర్యం కల్పించే బాధ్యత మెట్రో సంస్థదేనని తెలిపారు. ప్రభుత్వ భూమిలో వాహనాలను నిలిపితే డబ్బులు వసూలు చేయడమేమిటని ప్రశ్నించారు. డబ్బులు చెల్లించిన వాహనాలకు రక్షణలేదని వాపోయారు. రద్దీకి తగిన విధంగా సౌకర్యాలు కల్పించాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.